క్లుప్తంగా

22న హనుమజ్జయంతి



ఆంజనేయ స్వామి

మహారాణిపేట: ఈ నెల 22న హనుమజ్జయంతి సందర్భంగా పాతనగరంలోని మెయిన్‌రోడ్డు ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకు పూజ, సిందూర పూజ ఉంటాయని పేర్కొన్నారు.

న్యాయవాదుల సంఘం అధ్యక్షుడికి సత్కారం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న సెయింట్ ఆంథొనీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, సెయింట్ ఆంథొనీ పాఠశాల పూర్వ విద్యార్థి మోటమర్రి కామేశ్వర శ్రీనివాస్‌ను ఆ పాఠశాల 1982–83 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ సేవలను కొనియాడారు. న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చారని ప్రశంసించారు. సెయింట్ ఆంథొనీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1982–83 బ్యాచ్) వీఎస్ఆర్‌కే గణపతి, కిలపర్తి వెంకట మాధవరావు, రొబ్బి శ్రీనివాస్, కె.రామకృష్ణ, వదలి లక్ష్మీనారాయణ, కేవీ స్వరూప్, గుంటూరు శ్రీనివాస్ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

'మంచి నడవడికతో ఉంటాం..'



ప్రతిజ్ఞ చేస్తున్న రౌడీ షీటర్లు

డాబాగార్డెన్స్: 'ఇక నుంచి మంచిగా నడుచుకుంటాం.. మంచి నడవడికతో ఉంటాం..' అంటూ రౌడీ షీటర్లతో ప్రతిజ్ఞ చేయించారు వన్‌టౌన్ సీఐ జీడీ బాబు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లను స్టేషన్‌కు పిలిపించి, నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, ప్రజా శాంతికి భంగం కల్గించినా కఠిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారితో ప్రతిజ్ఞ చేయించారు.

రామలింగేశ్వరుడికి పుష్పోత్సవం



పుష్పోత్సవంలో రామలింగేశ్వరుడు

సీతంపేట: శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయంలో జరుగుతున్న పార్వతీ సహిత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం వసంతోత్సవం, పుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. గర్భగుడిలోని స్వామివారిని, పార్వతీ, రామలింగేశ్వరుల ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించి, సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన ఉయ్యాలలో పవళింపు సేవ జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని తిలకించి తరించారు. ఆలయ ఈవో జి.వి.రామాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జీఎస్టీ ఉద్యోగుల సైకిల్‌థాన్



సైకిల్‌థాన్‌లో పాల్గొన్న జీఎస్టీ ఉద్యోగులు

ఏయూక్యాంపస్: వస్తువులు, సేవల పన్ను(జీఎస్టీ) శాఖ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ ఉద్యోగులు సైకిల్‌థాన్ నిర్వహించారు. 'జీఎస్టీ–పన్నులను సరళీకరించడం, పౌరులను సాధికారపరచడం' నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఫిట్ ఇండియా క్యాంపెయిన్‌తో అనుసంధానం చేస్తూ సైకిల్‌థాన్ నిర్వహించారు. సెంట్రల్ రెవెన్యూ క్వార్టర్స్ నుంచి ఆర్.కె బీచ్ మీదుగా పార్కు హోటల్ కూడలి వరకు ఈ సైకిల్‌థాన్ కొనసాగింది.

వేసవిలో విజ్ఞానం వినోదం

వేసవి సెలవుల్లో పిల్లల్లో నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు గ్రంథాలయాలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ప్రత్యేక శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు కృషి చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాల బారిన పడి, పిల్లలు దారి తప్పకుండా చూస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ఈ శిబిరాలకు పంపించేందుకు ఇష్టపడుతున్నారు.



- గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు
- ప్రతి రోజూ నచ్చిన పుస్తకంలో కొన్ని పేజీలు చదవాల్సిందే..
- ఆర్ట్స్, క్రాఫ్ట్స్, సంగీతం, నృత్యం, ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ
- ఎంతగానో ఉపయోగపడుతున్నాయంటున్న విద్యార్థులు



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో చెస్ ఆడుతున్న చిన్నారులు



ఆంగ్లం నేర్చుకుంటున్నా..

వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటున్నా. గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో ఇంగ్లిష్ భాషపై మరింత పట్టు సాధించాలనుకుంటున్నా. ఇక్కడ చక్కగా నేర్పుతున్నారు. అలాగే డ్రాయింగ్‌ను సులభంగా వేయడం కూడా నేర్చుకున్నా. ఈ శిబిరం నాకు ఎంతో ఉపయోగపడుతోంది. – పి.శ్రీమన్నారాయణ, బంగారుమెట్ట

అల్లిపురం: గ్రంథాలయాలు ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయి. పిల్లల్ని గ్రంథాలయ సందర్శనకు అలవాటు పడేలా చేస్తున్నాయి. ఇందులో భాగంగానే అన్ని గ్రంథాలయాల్లో ఇప్పటికే వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. జూన్ 6 వరకూ కొనసాగనున్నాయి.

ఉదయం పూటే శిక్షణ

రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. అల్లిపురం శాఖాగ్రంథాలయం, జగదాంబ దరి జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు పలు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న ఈ శిబిరాలకు తల్లిదండ్రులు, విద్యార్థుల ఆదరణ బాగుంది. స్కూళ్లకు సెలవులిచ్చిన ప్రస్తుత తరుణంలో పిల్లలు టీవీ, మొబైళ్లకు అతుక్కుపోకుండా ఈ శిబిరాలు దోహదపడుతున్నాయని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం మొత్తం రెగ్యులర్ పాఠ్యాంశాలకే పరిమితమైన పిల్లలు గ్రంథాలయాలకు వెళ్లడం ద్వారా అక్కడి పుస్తకాలు, దిన, వార, మాస పత్రికల చదివేందుకు ఇష్టపడుతున్నారని చెప్తున్నారు. దీంతో వారిలో జనరల్ నాలెడ్జ్‌తోపాటు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచవ్యాప్త ధోరణులు, వింతలు, వినోదాలు తెలుసుకునే ఆసక్తి పెరిగిందని పేర్కొంటున్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నచ్చిన పుస్తకంలో కొన్ని పేజీలు..

శిక్షణ శిబిరంలో విజ్ఞానం, వినోదం, సంగీతం, నృత్యం, ఆంగ్ల భాష, భావవ్యక్తీకరణ తదితర అంశాలలో పట్టు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. పిల్లలకు ఆసక్తి కలిగించే పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాలు చదవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ శిబిరానికి రాగానే నచ్చిన పుస్తకంలో కొన్ని పేజీలు చదివిన తరువాతే.. మిగిలిన తరగతులు ప్రారంభిస్తున్నారు. స్టోరీ టెల్లింగ్(ఆకట్టుకునేలా కథలు చెప్పడం) నీతి కథలు, మానవీయ ప్రవర్తన, ఎదుట వ్యక్తిని ఆకట్టుకునేలా మాట్లాడటం, కరాటే, బాక్సింగ్ తదితర ఆత్మరక్షణ అంశాల్లో కూడా శిక్షణ ఇస్తున్నారు. చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నృత్యం తదితర అంశాల్లో నిపుణులిచ్చే సూచనలు వీరికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



విద్యార్థులతో గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు

బొమ్మలు బాగా వేస్తున్నా..



చిత్రలేఖనంపై ఆసక్తితో గ్రంథాలయంలో ఇస్తున్న శిక్షణకు వెళ్తున్నాను. వివిధ రకాల బొమ్మలు వేయడం నేర్చుకుంటున్నాను. పేపర్‌తో పలు రకాల ఆకృతులు తయారు చేయిస్తున్నారు. ఇంగ్లిష్, సైన్స్ తదితర సబ్జెక్టుల్లోని అంశాలను వివరిస్తున్నారు. ఇవి భవిష్యత్‌లో నాకు ఎంతగానో ఉపయోగపడతాయనడంలో సందేహం లేదు. – పి.రాకేష్, అల్లిపురం

కథలంటే ఇష్టం



నాకు కథలంటే చాలా ఇష్టం. గ్రంథాలయంలోని శిక్షణ తరగతుల్లో ఎంతో ఆసక్తి కలిగించే కథలు చెబుతున్నారు. కాగితాలతో రకరకాల బొమ్మలు చేయిస్తున్నారు. డ్రాయింగ్ నేర్పుతు న్నారు. సులభంగా బొమ్మలు ఎలా గీయాలో వివరిస్తున్నారు. ఇలాంటి మెళకువలు తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. –బి.రామసాయి, అల్లిపురం

మైండ్ గేమ్స్ ఆడిస్తున్నారు



గ్రంథాలయంలో నీతి కథలు చెబుతున్నారు. మంచి కథల పుస్తకాలు చదివిస్తున్నారు. వాటితో పాటు చెస్, క్యారమ్స్ వంటి మెదడుకు పనిచెప్పే ఆటలు ఆడిస్తున్నారు. శిక్షణా తరగతులు ఆసక్తికరంగా ఉన్నాయి. నాతో మాట్లాడిస్తున్నారు. అందువల్ల స్టేజ్ ఫియర్ పోతోంది. ఈ వేసవి తరగతులను సద్వినియోగం చేసుకుంటా. – ఎ.వినయ్‌రెడ్డి, కుమ్మరవీధి

సెల్ టవర్‌కు వ్యతిరేకంగా వినూత్న నిరసన

డాబాగార్డెన్స్: జనావాసాల్లో సెల్ టవర్ ఏర్పాటు చేయొద్దంటూ 38వ వార్డు చెంగల్రావుపేటకు చెందిన పలువురు స్థానికులు చెంగల్రావుపేట పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వినూత్న నిరసన చేపట్టారు. టవర్ రేడియేషన్ వల్ల ఏర్పడే అనర్థాలపై నమూనాతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ సెల్ టవర్ ఏర్పాటు వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అధిక రేడియేషన్ వల్ల పలు జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని, ఎనిమిదేళ్ల కిందట ఇదే ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తుంటే స్థానికులంతా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో టవర్ ఏర్పాటు అప్పట్లో నిలిపివేశారన్నారు. మళ్లీ ఇదే ప్రాంతంలో సెల్ టవర్ ఏర్పాటుకు జీవీఎంసీ అధికారులు ఎలా అనుమతులిచ్చారని ప్రశ్నించారు. టవర్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో పిల్లలు చదువుకునే స్కూల్, గర్భిణులకు ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రి ఉన్నాయన్నారు. సెల్ టవర్ రేడియేషన్ ప్రభావంతో పిల్లలు, పెద్దలు, గర్భిణులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని అనేక నివేదికలు చెబుతున్నా.. ఈ ప్రాంతంలో ఏర్పాటుకు ఆసక్తి చూపడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఇటీవల వార్డు పర్యటన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రసాద్, సుబ్బారావు, అప్పన్న, వై.రాజు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



సెల్ టవర్ నమూనాతో నిరసన తెలుపుతున్న చెంగల్రావుపేట పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఆక్రమణలతో ఇరుగ్గా రహదారి

జగదాంబ: పాత బస్టాండ్ రోడ్డు ఆక్రమణలకు గురవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులో ఏవీఎన్ కళాశాల నుంచి పాత బస్టాండ్ మీదుగా వెళ్లే రహదారిలో మంచాలవీధిలో దుకాణదారులు రోడ్డును ఆక్రమించి, కర్రసామగ్రి పెట్టేశారు. దీంతో రోజూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. 30 అడుగుల రోడ్డు ఆక్రమణల కారణంగా ఎనిమిది అడుగులకే పరిమితమైందన్నారు. ఇక్కడి ప్రధాన కాలువను కూడా ఆక్రమించేయడంతో పారిశుధ్య కార్మికులు డ్రైనేజీని శుభ్రం చేయించలేక వదిలేస్తున్నారని, దీంతో దుర్గంధంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని నివాసితులు చెబుతున్నారు. రహదారి పక్కన కొత్తగా దుకాణాలు ఏర్పడడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి, రోడ్డుపై ఆక్రమణలు తొలగించాలని.. రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.



ఆక్రమణకు గురైన పాత బస్టాండ్ రోడ్డు

ఎర్నిమాంబకు సారె సమర్పణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ జాతర మహోత్సవాల్లో భాగంగా అచ్చియ్యమ్మపేట గ్రామ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం సారె ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట నుంచి అల్లిపురం, కొబ్బరితోట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి మీదుగా ఆలయం వరకు పసుపు కుంకుమ, సారె, చీర ఊరేగించి, అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో కె.ఆదినారాయణ, వి.సూర్యారావు, నారాయణరావు, కుమార్, వి.సోమినాయుడు, మహిళలు, గ్రామ ప్రతినిధులు పాల్గొన్నారు.



అమ్మవారికి సమర్పించేందుకు సిద్ధం చేసిన సారెతో భక్తులు

వైభవం.. ఎర్నిమాంబ జాతర మహోత్సవం



ఎర్నిమాంబకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



ఆలయం వద్ద భక్తుల సందడి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘనంగా ముగిసిన అనుపోత్సవం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురం–అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పు ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాన్ని ఆలయ ఈవో డీవీవీ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము 4 నుంచి ఆలయ దర్శనాలకు క్యూలైన్లలో భక్తులు బారులుతీరారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మలు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఎమ్మెల్యే వంశీ కృష్ణశ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగర ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం మూలవిరాట్‌ను వేలాది మంది భక్తులు, సుమారు 260 అమ్మవారి ప్రతిమలను తలపై పెట్టుకుని వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతరలో నేల వేషాలు, అర్కెస్ట్రా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. దేవదాయ సిబ్బంది, ఆలయ చైర్మన్ లండా రమణ, కమిటీ ప్రతినిధులు, ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



స్వచ్ఛంద సభ్యులు ఏర్పాటు చేసిన ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న ఈవో సురేష్‌బాబా

ఎయిడ్స్ మృతులకు కొవ్వొత్తుల నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

మహారాణిపేట: అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆదివారం ర్యాలీ, సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా రామా టాకీస్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో మరణించిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ మౌనం పాటించారు. ఎయిడ్స్ మృతుల కుటుంబాలకు, ఎయిడ్స్‌తో జీవిస్తున్న వారికి భరోసా ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర ప్రారంభం



శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథం



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరిట దేశమంతటా నిర్వహించనున్న పవిత్ర రథయాత్ర ఆదివారం విశాఖలో ఘనంగా మొదలైంది. పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవస్థాన ఆవరణలో రథయాత్రను సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎస్.నాయుడు ప్రారంభించారు. అనంతరం శోభాయమానంగా సాగిన యాత్ర పోలమాంబ ఆలయం నుంచి శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ కూడలి మీదుగా ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయి ప్రేమసదన్ మందిరానికి చేరుకుంది. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. 'అందరినీ ప్రేమించండి – అందరినీ సేవించండి' అనే సత్యసాయిబాబా సందేశానికి అనుగుణంగా భక్తులంతా ముందుకు సాగాలన్నారు. ఎదుటి వారికి హాని తలపెట్టకూడదనే భావన నిత్యం అందరిలోను ఉండాలన్నారు. ఐదు ప్రేమ ప్రవాహిని రథాలు దేశవ్యాప్తంగా 600కు పైగా జిల్లాల్లో 3 లక్షల కిలోమీటర్లు ప్రచారం నిర్వహించనున్నాయని తెలిపారు. ప్రేమ, ఐక్యత, సేవా పంచే ఆలయాలుగా నిలుస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తాయన్నారు. నాలుగు రోజుల పాటు విశాఖ జిల్లాలో రథయాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా సేవా విభాగం కన్వీనర్ ఆర్.ఎ.నాయుడు, సిటీ సమితి కన్వీనర్ సీతారామరాజు పాల్గొన్నారు.



ప్రాణాలతో చెలగాటం!

తెన్నేటి పార్కు సమీపంలో ఆదివారం సాయంత్రం అత్యంత ప్రమాదకర దృశ్యం పర్యాటకులకు భయాందోళనకు గురి చేసింది. ఒక వ్యక్తి తన జీపుపై చిన్నారులను కూర్చోబెట్టి నిర్లక్ష్యంగా ప్రయాణించడం కనిపించింది. జీపు వేగంగా వెళుతుండగా.. పైన ఎలాంటి ఆధారం లేకుండా కూర్చున్న ఆ చిన్నారుల పరిస్థితి చూసి రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తే లేదా వాహనం అదుపు తప్పితే చిన్నారుల పరిస్థితి ఏమిటని వారు మదనపడ్డారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం